క్లుప్తంగా

ఘనంగా జోగి రమేష్ జన్మదిన వేడుకలు



ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, ఆత్మీయులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి అభినందించారు. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, కొండపల్లి మున్సిపాల్టీ వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **మైలవరం:** మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకటరావు, పాలా నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు



విస్సన్నపేట: మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. వేమిరెడ్డిపల్లి, నర్మదా నగర్ గ్రామాల్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, తాడు లాగుడు పోటీలు నిర్వహించారు. చిన్నారులకు నృత్య ప్రదర్శనలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

శోభన్‌బాబుకు ఘన నివాళి

ముసునూరు: సినీ రంగంలో సోగ్గాడుగా అభిమానుల హృదయాల్లో నిలిచిన అందాల నటుడు శోభన్‌బాబు చిరస్మరణీయుడని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, సత్యనారాయణ అన్నారు. మంగళవారం చెక్కపల్లి సెంటర్‌లో సమాఖ్య ఆధ్వర్యంలో శోభన్‌బాబు జయంతి కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు, పలువురు పౌరాణిక నాటక కళాకారులు శోభన్‌బాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు, అభిమానులు టి.సంపతరావు, ఎం. రామారావు, డి.అంజియ్య, వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



చాట్రాయి: మండలంలోని నరసింహారావుపాలెంలో బుధవారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు 118 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి బాలకోటిరెడ్డి మాట్లాడుతూ కుట్టు మిషన్లు మహిళలకు ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కో–ఆర్డినేటర్ లక్ష్మి, సభ్యులు వజ్రాల గోపి తదితరులు పాల్గొన్నారు.

వాయినాలు పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్ : కనుమ రోజున తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా మహిళలు వేడుకలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండ సతీమణి చారుగుండ పద్మావతి పాల్గొని మహిళలకు పండ్లు, వాయినాలు పంచుకునే కార్యక్రమం చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిల్లకల్లు: మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న నాటి సంగతులను గుర్తుచేసుకుని సంబరపడిపోయారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. పండుగ రోజున ఇలా అందరూ కలుసుకోవటం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

ఇబ్రహీంపట్నంలో తలపడుతున్న పొట్టేళ్లు



చాట్రాయి మండలం చనుబందలో నిర్వహిస్తున్న కోడిపందేలు



నూజివీడులో కోడిపందేలు



జి.కొండూరులో బరిలో తలపడుతున్న పుంజులు



జాతరలా జూదాలు

- జోరుగా సాగిన కోడి పందేలు, పేకాట
- ఫ్లడ్‌లైట్ల వెలుగులో పగలు, రాత్రి నిర్వహణ
- కట్టలు తెగిన నోట్లు.. చేతులు మారిన కోట్లు
- బరుల వద్ద మద్యం అమ్మకాలు
- శిబిరాల వైపు కన్నెత్తి చూడని అధికారులు

ఇబ్రహీంపట్నం(మైలవరం)/తిరువూరు/నూజివీడు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో మూడు రోజులు జూదాలు జాతరను తలపించాయి. కూటమి నాయకుల కనుసన్నల్లో ప్రత్యేకంగా బరులు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఫ్లడ్‌లైట్ల వెలుగులో పగలు, రాత్రి తేడా లేకుండా కోడిపందేలు, పేకాట, గుండాట, లోనా, బయట తదితర జూదక్రీడలు యథేచ్ఛగా జరిగాయి. బరుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. తినుబండారాలు, మద్యం సరఫరా చేశారు. భారీగా జనం తరలివచ్చి జూదాల్లో పాల్గొన్నారు. నిమిషాల వ్యవధిలోనే కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కొందరు లక్షలు పోగొట్టుకోగా మరికొందరు లక్షాధికారులయ్యారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో కూటమి నాయకులు కనుసన్నల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో జూద శిబిరాలు రాత్రి, పగలు యథేచ్ఛగా జరిగాయి. సోమవారం భోగి పండుగ నాడు ఏర్పాటు చేసిన కోడిపందేల శిబిరాలు కనుమ పండుగ బుధవారం వరకు మూడు రోజుల పాటు జోరుగా కొనసాగాయి. కొండపల్లి టీచర్స్ కాలనీ, చిలుకూరు, మూలపాడు, ఇబ్రహీంపట్నం, చినలంక శిబిరాల వద్ద చిన్న, పెద్ద బరులుగా రెండేసి చొప్పున ఏర్పాటు చేశారు. వీటిల్లో భారీ టెంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు తినబండారాలు, మద్యం విచ్చలవిడిగా సరఫరా చేశారు. కోడి పందేలతో పాటు వివిధ రకాల జూదక్రీడలు సంక్రాంతి సంప్రదాయ ఆటలుగా కొనసాగాయి. జూదరులు మాయాజాలంతో అనేకమంది సామాన్యులు తమ జేబులు ఖాళీ చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం శిబిరం వద్ద కోడి పందేలతో పాటు పొట్టేళ్ల పందేలు జరిగాయి. వీటిని తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. మూడు రోజుల్లో పందేలు, జూదాలపై బెట్టింగ్‌ల రూపంలో సుమారు రూ.2 కోట్లు చేతులు మారినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు శిబిరాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



జూపూడి చినలంక బరిలో తలపడుతున్న కోళ్లు



కొండపల్లి చిన్న బరిలో కోళ్లను కలుపుతున్న పందెంరాయుళ్లు



నూజివీడులో కోడిపందేలు చూస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్



మైలవరంలో కోడి పందేల బరి వద్ద మద్యం విక్రయాలు

'బరి' తెగింపు

నూజివీడు: పండుగకు ముందు పందేలకు సిద్ధం చేసిన బరులను పోలీసులు ధ్వంసం చేస్తున్నట్లు హడావుడి చేసినా సంక్రాంతి మూడు రోజులు మాత్రం మౌనం వహించారు. కోడిపందేల వైపే కన్నెత్తి చూడలేదు. దీంతో నూజివీడు నియోజకవర్గంలో పోలీసుల దాడుల భయం లేకుండా గతంలో ఎన్నడూ లేనివిధంగా కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. కోట్లు చేతులు మారడమే కాకుండా జూదాలు, మద్యం ఏరులై పారింది. నూజివీడు మండలంలో నూజివీడు పట్టణం, తుక్కులూరు, మిట్టగూడెం, రావిచర్లలోను, ఆగిరిపల్లి మండలంలో ఆగిరిపల్లి, ఈదర, అమ్మవారిగూడెం, నెక్కలం గొల్లగూడెం, అడవినెక్కలంలోను, ముసునూరు మండలంలో ముసునూరు, చెక్కపల్లి, గోపవరం, కాట్రేనిపాడు, సూరేపల్లి, గుడిపాడులోను, చాట్రాయి మండలంలో చనుబంద, చిత్తపూరులలో కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కోడిపందేల్లో దాదాపు రూ.50 కోట్లు చేతులు మారినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కోడిపందేలకు తోడు కోసు (లోపల– బయట), గుండాట ఇతర జూదాలు సైతం కోడిపందేల బరుల వద్ద కొనసాగాయి. ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఫ్లడ్‌లైట్ల వెలుగులో పొద్దుపోయే వరకు కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేలకు నూజివీడు పరిసర ప్రాంతాల వారితో పాటు తెలంగాణలోని ఖమ్మం, కల్లూరు, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల నుంచే కాకుండా ఏలూరు, భీమవరం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పందెంగాళ్లు తరలివచ్చారు. కోడిపందేలు చూసేందుకు మహిళలు సైతం బరుల వద్దకు తరలివచ్చారు. నూజివీడులో నిర్వహించిన కోడి పందేలను చూసేందుకు చివరి రోజున ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ విచ్చేశారు.

బుల్లెట్ బండి బహుమతి

చాట్రాయి మండలం చనుబందలో నిర్వహించిన కోడిపందేల్లో పందెం గెలిచిన వ్యక్తికి నిర్వాహకులు బుల్లెట్ బండిని బహూకరించారు. బరిలో ఒక్కసారే ఆరు కోడి పుంజులను దింపగా అందులో అన్నీ చనిపోయి ఒక కోడిపుంజు విజయం సాధించగా ఆ పుంజు యజమానికి బుల్లెట్ బండిని బహూకరించారు.

● **మైలవరం:** మైలవరం మండలంలో మైలవరం, వెల్వడం, చంద్రాల, పొందుగల, మొర్సుమల్లి, చంద్రగూడెం, గణపవరం తదితర గ్రామాలలో యథేచ్ఛగా కోడి పంతేలు నిర్వహించారు. నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధి జి.కొండూరు, గంగినేని, మునగపాడు, కట్టుబడిపాలెం, వెంకటాపురం, చేగిరెడ్డిపాడు, వెల్లటూరు, కోడూరు గ్రామాలలో కోడి పందేలు భారీ స్థాయిలో నిర్వహించారు. రెడ్డిగూడెం మండలం రంగాపురం, మద్దులపర్వ, ముచ్చనపల్లి తదితర గ్రామాల్లో కోడి పందాలు యథేచ్ఛగా నిర్వహించారు. కోడి పందాలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం గమనార్హం.

ఏరులైపారిన మద్యం

మైలవరంలో కోడి పందేల బరుల వద్ద అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా కోడి పందేలు, జూదాలు నిర్వహించడంతో పాటు మద్యం ఏరులైపారింది. మద్యం మత్తులో ప్రజలు చిత్తవడమే గాక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారు. మంగళవారం రాత్రి మైలవరంలో నిర్వహిస్తున్న కోడి పందేల బరి నుంచి మద్యం మత్తులో వస్తున్న మైలవరానికి చెందిన వ్యక్తి ప్రధాన రహదారిలో ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. పాఠశాలల బాలురు కూడా జూదాలలో పాల్గొనడం విశేషం.

మూడు రోజులు.. రూ. 30 కోట్లు

తిరువూరు: సంక్రాంతి జూదాలు తిరువూరు నియోజకవర్గంలో భారీ స్థాయిలో జరిగాయి. 12 బరుల్లో మూడు రోజుల్లో రూ.30 కోట్లకు పైగా జూదాల్లో చేతులు మారాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన పందెంరాయుళ్లు లక్షల్లో కోడిపందేల్లో పోగొట్టుకున్నారు. తిరువూరులో రెండు బరులు రాత్రింబవళ్లు జూదాలను నిర్వహించగా, మల్లేల, కాకర్ల, చీమలపాడు, ఊటుకూరు, తాతకుంట్ల గ్రామాల్లో భారీ స్థాయిలో పందేలు కొనసాగాయి. బుధవారం సాయంత్రం కూడా కోడి పందేలు, కోతముక్క, కోసు పందాలు కొనసాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు.



విస్సన్నపేట మండలం పుట్రేలలో కోడి పందేలు



తిరువూరులో సంక్రాంతి జూదాలు

ఘర్షణలు...చోరీలు

జూదాలు జరుగుతున్న బరుల వద్ద జేబుదొంగలు, బైక్ దొంగలు హల్‌చల్ చేశారు. ద్విచక్ర వాహనాలకు రూ.50, కార్లకు రూ.200 చొప్పున పార్కింగ్ ఫీజు వసూలు చేసిన నిర్వాహకులు అవి పోయినా తమకు సంబంధం లేదని చేతులు దులిపేసుకోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. జూదాలకు వచ్చి డబ్బు, వాహనాలు పోగొట్టుకున్న వారి నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు పోలీసులు నిరాకరించారు. తిరువూరు పశువుల సంత వద్ద, మల్లేలలో జూదరుల మధ్య ఘర్షణలు జరిగి పలువురు గాయపడ్డారు.

సందడిగా సంక్రాంతి

తిరువూరు: హిందువుల పెద్ద పండుగ మకర సంక్రాంతి వేడుకలు తిరువూరు మండలంలో సందడిగా సాగాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాల్లో ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి యువతులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. తిరువూరు వెంకటాచలస్వామి దేవాలయం, రంగనాయకస్వామి ఆలయం, కోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానాల్లో సంక్రాంతి పండుగ ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య కాలనీలో ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా సంఘం, సీపీఎం నాయకులు పంతంగి తులసీరాణి, ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, నాగేంద్రప్రసాద్, నాగమణి, చింతయ్య, పి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




తిరువూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

కోలాహలంగా వేడుకలు

గంపలగూడెం: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం సంక్రాంతి వేడుకలు జరిగాయి. గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణం కనులవిందుగా నిర్వహించారు. పెనుగొలను శివాలయంలో రెండు కిలోల వంద గ్రాముల కర్పూర జ్యోతి వెలిగించారు. మేడూరు అప్పయ్యస్వామి ఆలయం వద్ద కోటి పోగువత్తుల జ్యోతిని వెలించారు. ముందుగా అయ్యప్పస్వామి భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని జ్యోతిని తిలకించారు. కనుమ పండుగ సందర్భంగా పశువులను శుభ్రం చేసి రంగులు చల్లారు, గోవులకు పూజలు చేశారు. సంకాంత్రికి ప్రత్యేకంగా కన్పించే హరిదాసులు, గంగిరెద్దులు కనువిందు చేశారు. అరిశెలు, సకినాలు, కజ్జికాయలు లాంటి పిండి వంటకాలతో గ్రామాలు ఘుమఘుమలాడాయి. సంకాంత్రి పండుగ సందర్భంగా కొందరు తమ చిన్నారులకు భోగిపండ్ల పోసి ముచ్చట తీర్చుకొన్నారు. పలు గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, బాలికలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.



పెనుగొలను శివాలయం వద్ద వెలిగించిన కర్పూర జ్యోతి



మేడూరు అయ్యప్పస్వామి ఆలయం వెనుక గుట్టపై కోటిపోగు వత్తుల వెలుగు



నెమలిలో కల్యాణమూర్తులు గోదాదేవి, రంగనాయకస్వామి

కొలిక్కిరాని సొసైటీల పంచాయితీ

కూటమి పార్టీల మధ్య కుదరని ఏకాభిప్రాయం

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో సొసైటీలకు త్రిసభ్య కమిటీ నియామకం విషయమై కూటమి పార్టీల మధ్య పంచాయితీ కొలిక్కిరాలేదు. తమకు కావాలంటే తమకు కావాలంటూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పట్టుబడుతుండటంతో పంచాయితీ తీర్చడం తలనొప్పిగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి నాటికి సొసైటీలకు త్రిసభ్య కమిటీని నియమించనున్నట్లు కూటమి పార్టీలకు సమాచారం అందింది. దీంతో కూటమి పార్టీల నాయకులు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏ పార్టీకి ఎన్ని సొసైటీలను కేటాయించాలనే విషయమై కుస్తీపడుతున్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలుండగా మొత్తం 33 సొసైటీలున్నాయి. వీటిల్లో 30 శాతం అంటే పది సొసైటీలు తమకు కావాలని జనసేన నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. అయితే నాలుగో, ఐదో ఇచ్చి సరిపెట్టాలని టీడీపీ నాయకులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

జనసేన అడుగుతున్న సొసైటీలు ఇవే..

జనసేన నాయకులు నూజివీడు మండలం నూజివీడు, జంగంగూడెం, మొర్సపూడి, మీర్జాపురం, ఆగిరిపల్లి మండలంలోని కనసానపల్లి, ఈదర, ముసునూరు మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి, చాట్రాయి మండలంలోని బూరుగగూడెం సొసైటీలను ఇవ్వాలని ప్రతిపాదించారు. బీజేపీ నాయకులు నూజివీడు మండలంలోని మొర్సపూడి, ఆగిరిపల్లి మండలంలోని ఈదర, ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు, చాట్రాయి మండలంలోని పోలవరం సొసైటీలను తమకు ఇవ్వాలని ప్రతిపాదించారు. టీడీపీ నాయకుల తీరు మాత్రం మరోలా ఉన్నట్లు సమాచారం. కాట్రేనిపాడు సొసైటీని టీడీపీ ఇచ్చే పరిస్థితి లేదు. నామినేటెడ్ పదవుల కోసమైతే ఎగబడుతున్నారే గాని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వస్తారా అని కూటమి పార్టీల్లో పలువురు ప్రశ్నిస్తున్నారు.



నూజివీడు సొసైటీ కార్యాలయం

పోటీపడుతున్న టీడీపీ నాయకులు..

ఏ పార్టీకి ఎన్ని ఇవ్వాలో కొలిక్కి రాకముందే టీడీపీ నాయకులు సైతం సొసైటీ పదవుల కోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గంలో బీసీల ఓటింగ్ అధికంగా ఉన్నందున సొసైటీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి. నూజివీడు మండలం యనమదల సొసైటీకి బీసీలు, ఓసీలు పోటీ పడుతున్నారు. జంగంగూడెం, మొర్సపూడి సొసైటీలను జనసేనకు ఇవ్వాలనే ఆలోచన చేస్తుండగా, ఆపార్టీ నాయకులు మాత్రం మీర్జాపురం కావాలని కోరుతున్నారు. ముసునూరు సొసైటీ విషయంలో సైతం బీసీ వర్గాల్లో పోటీ నెలకొంది. ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చిన వారికి కాకుండా ఎప్పటి నుంచో టీడీపీలో ఉండి పార్టీ అభివృద్ధికి కృషిచేసిన బీసీ నాయకులకు ఇవ్వాలనే వాదన తెరమీదకు వచ్చింది. చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొనడంతో మండల నాయకులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. చాట్రాయి మండలం నరసింహారావుపాలెంలో సొసైటీ అధ్యక్ష పదవిని వైఎస్సార్ సీపీలో నుంచి టీడీపీలోకి వెళ్లిన వ్యక్తికి ఇవ్వాలని ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంతో దాదాపు 300 మంది టీడీపీకి రాజీనామా చేసే పరిస్థితి అక్కడ నెలకొంది.

బ్యాడ్మింటన్ విజేత కొత్తూరు తాడేపల్లి, జి.కొండూరు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఈడా వేదాద్రి ఇంజనీర్స్(ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ముగిశాయి. కొత్తూరు తాడేపల్లి, జి.కొండూరు జట్లు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచాయి. ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ ఇంజనీర్ ఈడా వేదాద్రి 12 ఏళ్లుగా ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నారు. సీనియర్ విభాగంలో కొత్తూరు తాడేపల్లికి చెందిన సతీష్, విజయ్‌కుమార్ జంట ప్రథమ స్థానం సాధించగా, జి కొండూరుకు చెందిన శ్రీనివాస్, లక్కీ జోడి ద్వితీయస్థానంలో నిలిచింది. జూనియర్స్ విభాగంలో జి.కొండూరుకు చెందిన నవీన్, శంకర్ ప్రథమ స్థానంలో, ప్రేమ్‌కుమార్, నవీన్ కుమార్ ద్వితీయ స్థానం సాధించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఈడా వేదాద్రి మాట్లాడుతూ విజేతలను అభినందించారు. క్రీడా పోటీలకు యువత నుంచి మంచి స్పందన లభించిందని, బ్యాడ్మింటన్‌లో ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు.



ఈవీఈ ఓపెన్ బ్యాడ్మింటన్ విజేతలు

విజేతలకు బహుమతుల ప్రదానం



వత్సవాయి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వత్సవాయిలో మంగళవారం ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఎస్ఐ రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సంక్రాంతి అంటే నేడు కోడి పందేలు, గుండాట, పేకాటగా మారిందని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. సీపీఎం జిల్లా నాయకుడు చిరుమామిళ్ల హనుమంతురావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని, దాని విశిష్టతను నేటితరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, ఐద్వా నాయకురాలు జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.